క్లుప్తంగా

ఘనంగా గణేశుని ఊరేగింపు



గణపతిని ఊరేగిస్తున్న భక్తులు

పిఠాపురం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా పిఠాపురం శ్రీ బాలగంగాధర్ తిలక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన గణేశుని ఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఉన్న అయోధ్య నగర్‌లో ప్రతిష్ఠించిన గణేశునికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని బీచ్‌లో నిమజ్జనం చేశారు. గణపతి లడ్డూను నవదుర్గ భక్త మండలి సభ్యులు రూ.5,516కు వేలం పాటలో దక్కించుకున్నారు.

క్లూస్ టీం పరిశీలన



చోరీ జరిగిన మందుల దుకాణంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చోరీ జరిగిన రెండు దుకాణాలను క్లూస్ టీం, క్రైం పోలీసు అధికారులు మంగళవారం పరిశీలించారు. సోమవారం కదారి మందుల దుకాణంలో రూ.7 వేలు, ఫ్యాన్సీ దుకాణంలో రూ.1.50 లక్షలు చోరీ అయిన ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు.

సారా తరలిస్తున్న మహిళ అరెస్టు

కొత్తపల్లి: సారా తరలిస్తున్న ఓ మహిళను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి కథనం ప్రకారం.. ఉప్పాడ శివారు సూరాడపేటకు చెందిన పెనుమల్లు అడివమ్మ ఐదు లీటర్ల సారా తరస్తూండగా ఎస్సై స్వామి నాయుడు అరెస్టు చేశారు. సారాను స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రమాంపల్లిలో ధర్నా

పెద్దాపురం: ఏటిపట్టు ప్రాంతంలోని 11 గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాల మంజూరులో జాప్యంపై నిరసన వ్యక్తం చేస్తూ మండలంలోని చంద్రమాంపల్లి జంక్షన్‌లో మంగళవారం సీపీఎం, జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు కేదారి నాగు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు.

వాహన చోదకులకు డ్రైవింగ్, ఆర్సీ కార్డులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో వాహన చోదకులకు లైసెన్సులు, ఆర్సీ కార్డులు త్వరలో పంపిణీ కానున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు 60 వేల కార్డులు ప్రింట్ చేసి, వరుస క్రమంలో పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు తొలి విడతలో 10 వేల కార్డులు రావడంతో ప్రింటింగ్ ప్రారంభించి, స్పీడ్ పోస్టు ద్వారా వారి చిరునామాకు పంపనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి డిజిటల్ విధానాన్ని ప్రారంభించిన నేపథ్యంలో రవాణా శాఖ ఈ ఏడాది ఆగస్టు నుంచి సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వాహన చోదకులకు రవాణా శాఖ జారీ చేసే డ్రైవింగ్, ఆర్సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రమే సరిపోతుంది. రవాణాశాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ చేయడంతో చాలా రాష్ట్రాల్లో కార్డులు తొలగించి డిజిటల్ విధానంలో పత్రాలు తీసుకురాగా ఇప్పుడు ఏపీలో అమల్లోకి తెచ్చారు. రవాణా శాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్‌టీఏసీ సిటిజన్.ఈ ప్రగతి.ఓఆర్‌టీ ఫారం6 లేదా 23ని డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రాన్ని తీసుకోవాలి. లేదా ఏపీఆర్‌టీఏసిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీస్, లేదా రవాణా శాఖాధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 31 వరకూ కార్డు ఫీజు రూ.225 వసూలు చేసిన విషయం తెలిసిందే. వారికి మాత్రమే ఈ కార్డులను పంపిణీ చేయనున్నారు. కాగా ఆగస్టు నుంచి కార్డులు నిలిపివేసి, రవాణా శాఖ వెబ్‌సైట్ నుంచి కేవలం ప్రింట్ మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమించి రోడ్డు!

కరప: పెనుగుదురులో శ్మశాన స్థలాన్ని ఆక్రమించడమే కాక రోడ్డు వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ – రామచంద్రపురం రోడ్డు పక్కన ఉన్న పెనుగుదురు శ్మశానానికి, పంతర్లోడ్డుకు మధ్య మట్టపర్తి అనంతలక్ష్మికి జిరాయితీ భూమి ఉంది. ఇటీవల జరిగిన భూరక్ష రీసర్వే అనంతరం మక్కురాళ్లు కూడా పాతారు. అయితే ఆ స్థల యజమాని మెయిన్ రోడ్డు నుంచి తన స్థలంలోకి రోడ్డు వేస్తుండడంతో గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి బి.చంద్రకళ, వీఆర్వో పి.ఆదినారాయణలకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ఆ స్థలాన్ని పరిశీలించి సంబంధిత పత్రాలను తీసుకువస్తే బుధవారం సర్వే చేయిస్తామని, అంతవరకూ పనులు నిలిపివేయాలని హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

- పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పట్టణంలో వైద్య శిబిరం సందర్శన



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పట్టణంలోని ఇంద్రా నగర్‌లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. నిపుణులైన వైద్యులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. వీటిల్లో అన్ని 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. వైద్య పరీక్షలు అనంతరం వైద్యుల సలహా మేరకు రోగులకు అవసరమైన మందుల కిట్ అందిస్తామని ఎమ్మెల్యే దొరబాబు తెలిపారు. ఉన్నత వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమినాబాద్‌లో..

కొత్తపల్లి: అమినాబాద్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 322 మందికి వైద్య పరీక్షలు చేశామని స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ఉచిత వైద్య పరీక్షలు చేసి, టోకెన్లు జారీ చేస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రోగులకు మెరుగైన సేవలందించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైద్య రంగంలో విశేష మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా అత్యున్నత వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకువచ్చారని వివరించారు. సర్పంచ్ నక్క మణికంఠబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమినాబాద్‌లో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా అమినాబాద్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యాన న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అమినాబాద్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న అధికారులు, నేతలు



అమినాబాద్‌లో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి గడపవద్ద ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ఒక్క రూపాయి భారం లేకుండా ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో దొరబాబు మాట్లాడతూ ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నని జగనన్న ప్రభుత్వమేనన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఐదు దశల్లో జగన్న ఆరోగ్య సురక్ష ద్వారా అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఏడీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సరిత, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఏరియా ఆస్పత్రి వైద్యులు ఎస్.సుదీప్తి కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న దొరబాబు

410 మందికి ఆరోగ్య పరీక్షలు

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మాధవపట్నం 2 సచివాలయం పరిధిలో మంగళవారం 410 మందికి వివిధ ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేసి వారికి మందులు అందజేసినట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. మాధవపటం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ శ్రీలలిత, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రంతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రశాంత్, శ్రీహిమవతి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్ని రోగులకు సేవలందించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యాన్ని వివరిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఓటర్ల తొలగింపులో కుట్రలకు తావు లేదు

పిఠాపురం: ఓటర్ల తొలగింపులో ఎటువంటి కుట్రలకూ తావు లేదని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, నియమ నిబంధనల ప్రకారమే ఓటర్ల సవరణ జాబితా తయారు చేశామని నియోజవర్గ ఎన్నికల అధికారి సుబ్బారావు అన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లకు సంబంధించి నాయకులకు పూర్తి వివరాలు అందజేసి, వారి సూచనలు సలహాలు తీసుకున్నామని తెలిపారు. ఓటర్ల తొలగింపులో కుట్రలు జరుగుతున్నాయంటూ కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని చెప్పారు. నిబంధనల ప్రకారమే ఓటర్ల తొలగింపు చేపట్టామన్నారు. దూర ప్రాంతాల్లోని ఓటర్లకు తగిన సమాచారం, సమయం కూడా ఇచ్చామని తెలిపారు. పూర్తి ఆధారాలు ఉన్న వాటిపై మాత్రమే చర్యలు తీసుకున్నామన్నారు. ఓటర్ల తొలగింపుపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కోనేటి రాజు, అల్లుబోయిన సూరిబాబు, నంది గణేష్, కె.అప్పారావు, బి.రాంబాబు, నియోజకవర్గ ఏఈఆర్‌ఓలు, పిఠాపురం, కొత్తపల్లి, గొల్లపోలు తహసీల్దార్లు, పిఠాపురం మున్సిపాల్టీ, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్లు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు

- పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఘనంగా వైఎస్సార్ సీపీ పట్టణ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారం



పట్టణ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బొజ్జా దొరబాబు

పిఠాపురం: పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ, అనుబంధ విభాగాల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం పట్టణంలోని కేవీకేటీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు బొజ్జావారి తోట నుంచి భారీగా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా బొజ్జా దొరబాబు, ఉపాధ్యక్షులుగా పైలా రాయుడు, వజ్రపు వీరేష్, ప్రధాన కార్యదర్శులుగా బోను దేవా, పచ్చిమళ్ళ అప్పలరాజు, కండేపల్లి ఆనంద శేఖర్, రామకుర్తి నాగేశ్వరరావు, బోణాసుల శివతో పాటు సంయుక్త కార్యదర్శులు, అనుబంధ విభాగ కమిటీల సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసువెళ్లి వివరించాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఓర్వలేక ఎల్లో మీడియా, పచ్చ చొక్కాల నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గండేపల్లి బాబీ, పచ్చిమళ్ళ అప్పలరాజు, కొత్తపల్లి వీర వెంకట సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

- రోడ్డు మార్జిన్లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు
- దుకాణదారులను హెచ్చరించిన పోలీసులు

సామర్లకోట: రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల వల్ల తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కాకినాడ రోడ్డులో ఉదయం, సాయంత్రం సమయంలో వివిధ కళాశాలల బస్సులు రాక పోకల సమయంలో రైల్వే గేటు నుంచి ఐదు తూముల మధ్య రోడ్డు మార్జిన్‌లో పలు దుకాణాల వల్ల నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో రైల్వే గేటు సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న దుకాణాల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ట్రాపిక్‌కు అంతరాయం లేకుండా షాపులు ఏర్పాటు చేసుకోవాలని, షాపుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే తొలగిస్తామని హెచ్చరించారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు ఇక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని బొమ్మలు విక్రయిస్తున్నారు. ఆయా దుకాణాలు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ సూచనలతో ట్రాఫిక్ ఎస్సై తన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు.



రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణ దారులను హెచ్చరిస్తున్న ఎస్సై గరగారావు

శరన్నవరాత్రుల్లో నిత్యహోమాలు

- పంచారామ క్షేత్రం ట్రస్టు బోర్డు తీర్మానం
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ట్రస్టుబోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు, భక్తసంఘం నాయకులు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ట్రస్టు బోర్డు తీర్మానించింది. మంగళవారం క్షేత్రంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ట్రస్టు బోర్డు సమావేశమైంది. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు ప్రతి రోజు భక్తులు హోమాలు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రసాదాలకు రూ.11,111 విరాళం ఇస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. 30వ వార్డు కౌన్సిలర్ చల్లపల్లి వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ హోమాలు దేవస్థానం తరఫున జరిగేలా చూడాలన్నారు. బయట వ్యక్తులు చేడయం వల్ల ఆలయానికి చెడ్డ పేరు వస్తుందని ఆరోపించారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, కోనేరును కొత్త నీటితో నింపుతామని, అర్చకుల ఆధ్వర్యంలో నిత్యం ఒక అమ్మవారి అలంకరణ ఉంటుందన్నారు. మొదటి రోజు అలంకరణ మరునాటి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, భక్త సంఘం నాయకులు కృష్ణారావు, గంగిరెడ్డి కృష్ణమూర్తి, బొందలపు వెంకటరమణ, అభిషేక పండితులు కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పాల్గొన్నారు.

కొలువుకు సంసిద్ధంగా శిక్షణ

- నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా సాంకేతిక కళాశాలలు
- పాలిటెక్నిక్, ఐటీఐలలో విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు
- కోర్సు పూర్తి కాగానే నేరుగా ఉపాధి పొందేలా కార్యాచరణ
- కాకినాడ అర్బన్‌కు ఏపీటీ, రూరల్‌కు ఐటీఐలో శిక్షణ కేంద్రాలు



ఐటీఐ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు ఏ కోర్సు చేసినా సరైన కమ్యూనికేషన్స్ స్కిల్స్ లేకపోవడంతో వారు ఉద్యోగ సాధనలో రాణించలేకపోతున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరవుతున్నా, కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మహోన్నతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాకినాడ అర్బన్‌కు సంబంధించి ఆంధ్రా పాలిటెక్నిక్, రూరల్‌కు సంబంధించి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే పక్కాగా ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తూ ఈ సంస్థలు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఈ కోర్సులు దోహదపడుతున్నాయి. విద్యా సంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాకు ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ నైపుణ్యాభివృద్ధిని అందించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కాకినాడ, రూరల్ పరిధిలో ఒక ప్రభుత్వ, 3 ప్రైవేట్ ఐటీలు ఉండగా 800 సీట్లు ఉన్నాయి.

ట్రేడులు ఇలా..

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్), కోపా, ఆర్‌అండ్‌ఏసీ, ట్రేడులు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రెంటిస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

ఐదో విడత ఐటీఐ అడ్మిషన్ల నిర్వహణ..



ఈ నెల 9వ తేదిన ఐటీఐలో మిగిలిన సీట్లకు ఐదో విడత అడ్మిషన్లు కల్పిస్తున్నాం. ఐటీఐ పూర్తి చేసిన వెంటనే నేరుగా పరిశ్రమలోకి వెళ్లి ఉద్యోగం చేయడంలో ఇబ్బందులు పడేకన్నా, శిక్షణ పొంది వెళ్లడం ద్వారా విధుల నిర్వహణ కష్టం కాకుండా ఉంటుంది. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రత్యేక స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వడం బాగుంది. ప్రతి ఇంటర్వ్యూల్లో విద్యార్థి స్కిల్స్ పరిక్షిస్తున్నారు. ముందుగానే వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగం త్వరగా పొందవచ్చు. నైపుణ్యాలు పెంచుకుంటే పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– ఎం.వేణుగోపాల వర్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

పరీక్షలకు ప్రణాళికతో సిద్ధంకండి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీవైఈఓ డానియల్ రాజు

సామర్లకోట: విద్యార్థులు ప్రతి పరీక్షకు పబ్లిక్ పరీక్షల మాదిరిగా సన్నద్ధమైతే అసలు పరీక్షంటే భయం ఉండదని డీవైఈఓ డానియల్ రాజు అన్నారు. ఫార్మెటివ్ 2 పరీక్షలల్లో భాగంగా మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. మారిన పరీక్ష మోడల్‌పై విద్యార్థులను ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ హైస్కూల్‌లో సీబీఎస్ఈ విధానంలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఆరో తేదీ నుంచి పరీక్షల షెడ్యూల్ మారినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు రాగి జావ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఏఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఉపాధ్యాయులతో పాటు, తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.